క్లుప్తంగా

వైద్యులు సమయపాలన పాటించాలి

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించాలని బీజేపీ మోర్చా నాయకులు జన్ని పరమేశ్వరావు, సీహెచ్.లింగరాజు అన్నారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రిని సందర్శించారు. వైద్యులు సకాలంలో రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మద్యం షాపుల కోసం 152 దరఖాస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ విధానంలో తమ పరిధిలో ఉన్న 15 మద్యం షాపుల అనుమతి కోసం 152 దరఖాస్తులను స్వీకరించామని పలాస ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.మల్లికార్జునరావు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు గడువు ఉందన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఆరు దుకాణాలకు 71 దరఖాస్తులు రాగా.. వాటిలో షాపు నంబర్ 136కు అత్యధికంగా 18 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఎరుకుల సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడిగా రమణమూర్తి

టెక్కలి: ఎరుకుల సేవా సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడిగా టెక్కలి మండలం పాతనౌపడ గ్రామానికి చెందిన గేదెల రమణమూర్తిని ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలో ఎరుకుల జాతి సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కృష్ణదాస్‌కు అభినందనలు


కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన ధర్మాన కృష్ణదాస్‌ను క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అభినందిచారు. నరసన్నపేటలో గురువారం జరిగిన బాధ్యతల స్వీకరణలో కృష్ణదాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విశ్రాంత ఎంఈవో కుటుంబానికి పరామర్శ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి చినబడంలో నివాసం ఉంటున్న విశ్రాంత ఎంఈవో బడగల నరసింహులు ఇటీవల మరణించారు. దీంతో అతని కుటుంబాన్ని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు దువ్వాడ శ్రీధర్ గురువారం పరామర్శించారు. కూన హేమాచలం, పాతాల ముకుంద, శ్రీనివాసరావు ఉన్నారు.

తహసీల్దార్‌గా సామేశ్వరరావు


సోమేశ్వరరావు

నందిగాం: నందిగాం మండల తహసీల్దార్‌గా పి.సోమేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఎన్నికల ముందు జరిగిన బదిలీలో వచ్చిన పద్మావతి ఎన్నికల అనంతరం విజయనగరం జిల్లాకు వెళ్ళిపోగా.. ఇంతవరకు ఇన్‌చార్జిగా తహసీల్దార్‌గా డీటీ భాగ్యలక్ష్మి వ్యవహరించారు. ఈమె కూడా పలాస ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పోషకాహార కిట్లు పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు పోషకాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ద్వారా అందజేస్తున్న వీటిని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దుక్క ధనలక్ష్మి అన్నారు.

ఎంపీఎం ప్రసాద్‌కు అభినందనలు


ప్రసాదరావును సత్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది

కాశీబుగ్గ: మందస మండలంలో వెలుగు ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న గొడవ ప్రసాద్‌ను ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణ చంద్ర పాత్రోతో పాటు సిబ్బంది గురువారం సత్కరించి అభినందించారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, లావాదేవీలు సంక్రమంగా చెల్లింపులు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీసీ కిషోర్, వీవోఏలు ఉన్నారు.

వైభవంగా కొత్తమ్మతల్లి మారుజాతర

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. జాతర జరిగిన మారువారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ వి.రాధాకృష్ణ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు.


కంచిలి: జగన్మాత అవతారంలో కంచమ్మతల్లి అమ్మవారు


సోంపేట: దుర్గాదేవిగా సోంపేట సోమపోలమాంబదేవి


ఇచ్ఛాపురం రూరల్: తులసిగాంలో దుర్గాదేవి అవతారంలో వహిదేవి అమ్మవారు


ఇచ్ఛాపురం: మహాగౌరీదేవి అవతారంలో స్వేచ్ఛావతి అమ్మవారు


వజ్రపుకొత్తూరు రూరల్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

దుర్గమ్మా.. కరుణించమ్మా..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. దీంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఎనిమిదో రోజైన గురువారం వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి దుర్గాదేవీ కారుణించమ్మా అని మొక్కులు చెల్లించుకున్నారు. భజనలు, అన్నప్రసాద వితరణలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


కవిటిజగతిలో పూజలందుకుంటున్న గ్రామదేవత మర్లపోలమ్మవారు


సంతబొమ్మాళి: నౌపడ పాలపోలమ్మతల్లి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, దేవరాజు దంపతులు


కాశీబుగ్గ: పలాస సత్యసాయి మందిరంలో దుర్గామాతకు మహిళల కుంకుమ పూజలు


నందిగాం: పాతపట్నం అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కాశీబుగ్గ: పెద్దబ్రాహ్మణవీధిలో దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


కాశీబుగ్గ: 12వవార్డు హరిజనవీధిలో దుర్గమ్మ సేవలో యువకులు

స్వేదం..సేద్యం!

- ఉద్యానవన పంటలే వారికి జీవనోపాధి


ముల్లంగి, తోటకూరను మంచినీటితో శుభ్రం చేస్తున్న మహిళలు

పలాస:

వాణిజ్య కేంద్రమైన పలాస పట్టణం నడిబొడ్డున అత్యంత వెనుకబడిన పొందర సామాజిక వర్గానికి చెందిన రైతులు తరతరాలుగా ఆకుకూరలు, కూరగాయలు పండిస్తూ వాటినే తమ జీవనోపాధిగా చేసుకొని జీవిస్తున్నారు. పెద్దవీధిలో ఉంటున్న సుమారు 300 కుటుంబాలు తాత ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన సుమారు 25 ఎకరాల పొంటపొలాల్లో వీటిని సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒక్కో కుటుంబానికి 10 నుంచి 20 సెంట్లు భూమి మాత్రమే ఉంది. ఆ చిన్న కమతాల్లోనే వారు ఒకేసారి పలురకాల కాయగూరలను సాగు చేస్తున్నారు. దొండ, బీన్స్, క్యాబేజీ, బెండ, ముల్లంగి, కరివేపాకు, కొత్తిమీర, పాలకూల, అరటి తదితర పంటలను పండిస్తున్నారు. అన్ని రకాల కాయగూరలు, ఆకుకూరలు వీరు పండించి పలాస మార్కెట్‌తో పాటు పరిసర గ్రామాల్లోకి తీసుకుపోయి వారే అమ్మకాలు చేస్తుంటారు. వీరు పండించే ఈ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. విలువైన భూములను ఇళ్ల స్థలాలకు అమ్మకుండా ఈవిధంగా మంచి ఆహార పంటలను పండిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పరంగా కూడా వారికి తగిన సహాయం ఇప్పటి వరకు అందింది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తమ వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా కరెంటు ఇచ్చిందని భవిష్యత్తులో ఎలా ఉంటుందోనని అక్కడ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అంతే కాకుండా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గతంలో ఓసీలో ఉన్న తమను బీసీల జాబితాలో చేర్చడంతో ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ ఫలాలు నేడు అందుతున్నాయని ఆ గ్రామానికి చెందిన విద్యాధికుడు దుర్గాప్రసాద్ పాత్రో 'సాక్షి'కి చెప్పారు.


దొండకాయలు ఏరుతున్న మహిళ

తక్కువ స్థలంలోనే సాగు..



మాకు పెద్దగా భూముల్లేవు. తక్కువ స్థలంలోనే కాయగూరలను పండిస్తున్నాము. దొండ పందిరి మీద ఉంటే దాని కింద తోటకూర సాగు చేస్తాం. ఒకేసారి ఒకే చోట రెండు మూడు పంటలు వేస్తాం. ఏడాది పొడుగునా ఈ పంటలే మాకు జీవనోపాధి. కుటుంబ సభ్యులమంతా కష్టపడి పంటలను పండించి మార్కెటులో అమ్మి జీవనం సాగిస్తున్నాం. మా పంటలను టోకు వ్యాపారులకు ఎక్కువగా ఇస్తుంటాము.

– క్రిష్టారావు బెహరా, రైతు, పలాస పెద్దవీధి

గ్రామాల్లో విక్రయిస్తా..



మేము పండించిన ఈ పంటలను మా పరిసర గ్రామాల్లో వీధుల్లోకి వెళ్లి అమ్ముతాము. తాము వీధిలోకి వెళ్లగానే చాలామంది ఆసక్తిగా ఆకుకూరలు, కూరగాయలు కొంటారు. గంటలోనే అమ్ముడు పోతాయి. ఉదయం పొలం నుంచి సేకరించిన వాటిని సాయంత్రం, సాయింత్రం సేకరించినవి ఉదయం పూట అమ్ముతూ జీవనం సాగిస్తున్నాము.

– ఉత్తం బెహరా, మహిళా రైతు, పలాస పెద్ద వీధి

జగనన్న ప్రభుత్వంలో ఉచిత విద్యుత్



గతంలో ఎన్నడు లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో మాకు ఉచిత విద్యుత్ అందింది. ఇక భవిష్యత్తులో ఎలా ఉంటుందో చెప్పలేం. ఇప్పటివరకు కరెంటు బిల్లులు రాలేదు. మాకు వర్షాలతో సంబంధం లేదు. 15 వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. వాటిమీద మా వ్యవసాయం ఆధారం. ఎరువులు, పురుగులు మందులు కూడా సబ్సిడీ మీద ఇస్తే బాగుంటుంది. మేము అమ్ముకోవడానికి సరైన స్థలం కావాలి.

– డిల్లీరావు బెహరా, రైతు, పలాస పొందరవీధి

శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు


పలాస ఎర్రచెరువు గట్టుపై నాయకులతో కలిసి చెత్తను తుడుస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ/పలాస: మన పలాస–మన బాధ్యత అంటూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు మేరకు నియోజకవర్గం వ్యాప్తంగా ఏకకాలంలో శ్రమదానంతో పారిశుద్ధ్య పనులను గురువారం చేపట్టారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు ఎర్రచెరువు గట్టుపై పేరుకుపోయిన చెత్తను తొలగించే పనుల్లో ఎమ్మెల్యే శిరీష పాల్గొన్నారు. అనంతరం పారసాంబ, కేదారిపురం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలుత మన ఇంటిని శుభ్రం చేసుకుని అనంతరం మన ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఏకకాలంలో సుమారు 500 కిలోమీటర్ల దూరం ఉన్నటువంటి పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపాలిటీ రోడ్లలో జంగిల్ క్లియరెన్స్, చెత్త, పిచి మొక్కలు తొలగించడం, గోతులను పూడ్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అలవాటుగా మార్చుకుంటామన్నారు. పనుల పరిశీలన నిమిత్తం విచ్చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ పర్హాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. పలాస నియోజకవర్గంలో ఇటువంటి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించడం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ రామారావు, నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్ రావు, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, డొక్కరి శంకరరావు, మల్లా శ్రీనివాసరావు, గాలి క్రిష్టారావు, టి.రవిశంకర్ గుప్తా, దడియాల నరసింహులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్, మేనేజర్లు

టెక్కలి: సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లా అన్నవరం, ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్టణం జిల్లా నునపర్తి గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా జిల్లా జట్టులో టెక్కలి క్రీడాకారులు ప్రతిభ చూపినట్లు కోచ్, మేనేజర్లు ఎల్.వి.రమణ, జె.హరి, ఎల్.రమేష్, డాక్టర్ బి.మహారాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయా క్రీడాకారులను అభినందించారు. ఇందులో ఎస్.కిరణ్, పి.భవాని, వై.యోగి, జి.సాయిశంకర్‌రెడ్డి తదితరులు ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు జి.చంద్రశేఖర్, సుమిత్ర సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రామ్‌ప్రసాద్, అభయం సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

బూర్జపాడులో సామూహిక కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజలో మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: సరస్వతీదేవి పంచమ రాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం బూర్జపాడులో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు భారీగా పాల్గొన్నారు. ఏటా స్థానిక మండపంపై ఏర్పాటు చేసే సరస్వతీ పూజకు 22 ఏళ్లు పూర్తయిందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్థానిక భజనా కళాకారులచే హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తన జరిగింది.

ఐదు వేలమందికి అన్నప్రసాదం వితరణ


అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఐదువేలమందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

క్విజ్ విజేత కవిటి

సోంపేట: లక్కవరం గ్రామంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల్లో కవిటి చింతామణి టీం ప్రథమ బహుమతి గెలుచుకుంది. దుర్గా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పోటీలు నిర్వహించారు. ప్రథమ, తృతీయ బహుమతులు కవిటి జట్లు గెలుచుకోగా.. ద్వితీయ బహుమతి లండారి పుట్టుగ టీం గెలుచుకుంది. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.8 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ. 3 వేలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కమిటీ సభ్యులు సనపల శ్రీరామమూర్తి, పండి నారాయణరావు, వజ్జ కృష్ణారావు, హేమసుందరరావు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

వానప్రస్థాశ్రమానికి రూ. 50 వేల విరాళం



కంచిలి: మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వానప్రస్థాశ్రమానికి సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన ఉలాల హరిక్రిష్ణ జ్యోతి దంపతులు రూ. 50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మాకన్నపురం సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, ఎం.ఎస్.ఆర్. సేవా సంఘం సభ్యుల ద్వారా ఆశ్రమ నిర్వాహకుడు గుళ్ల రమేష్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ద్వారకా డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మద్దు శంకరరావు, బతకల గణపతి ఉన్నారు.

చెక్కును అందజేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు తమతో చదవుకున్న స్నేహితురాలు జె.సుజాతకు రూ.18,300 ఆర్థిక సాయం చేశారు. సుజాత కుమారుడు పాఠశాలలో ఆడుకుంటూ పడిపోవడంతో కుడి చేయి విరిగిపోయింది. చికిత్స కోసం ఎక్కువ ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో నిరుపేద కుటుంబమైన సుజాతకు తోటి స్నేహితులు అండగా నిలిచారు. జి.శ్రీనివాసరెడ్డి, కేపీ రమణ, ఎం.డిల్లేశ్వరరావు, ఎం.రాజు ఉన్నారు.

భవానీ స్వాముల పూజలు

పలాస: కాశీబుగ్గ హరిజన వీధిలో భవానీ స్వాములు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తి మండల సభ్యులు సీహెచ్ నేతాజీ, గ్రంధం రవి, సుగుణరావు, యు.రాము, భవానీ , ఉర్నాన అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ


పుస్తకాలను అందజేస్తున్న మోహన్‌రావు

టెక్కలి: టెక్కలి శాఖా గ్రంథాలయానికి గూడేం గ్రామానికి చెందిన విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు జి.మోహన్‌రావు పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. పుస్తకాలను గ్రంథాలయాధికారి రూపావతికి గురువారం అందజేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ, గ్రూప్స్ ప్రిపరేషన్ తదితర పుస్తకాలను అందజేశారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.